# అదానీల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు




## సమన్లు పంపిన అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్

న్యూయార్క్, నవంబర్ 23: లంచం, నేరారోపణల కేసులో అమెరికా దూకుడును ప్రదర్శిస్తున్నది. అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీతోపాటు ఆయన మేనల్లుడు సాగర్ అదానీకి అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్.. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సమన్లు పంపింది. అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు సాగర్ అదానీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న విషయం తెలిసిందే. కాగా, దేశంలో సోలార్ పవర్ కాంట్రాక్టులను పొందడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికార వర్గాలకు రూ.2,200 కోట్లకుపైగా లంచాలు ఇచ్చారని ఎస్ఈసీ ఆరోపిస్తున్న సంగతి విదితమే. ఈ వ్యవహారంలో అమెరికా న్యాయ శాఖ, ఎఫ్‌బీఐ దర్యాప్తులూ జరుగుతుండగా.. అదానీసహా మొత్తం 8 మందిపై అభియోగాలు నమోదయ్యాయి. ఇప్పటికే గౌతమ్ అదానీ, సాగర్ అదానీలపై అమెరికాలో అరెస్ట్ వారెంట్లు కూడా జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలపై వివరణ కోరుతూ ఎస్ఈసీ ఈ సమన్లు జారీ చేసింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోగల అదానీల నివాసాలకు వీటిని పంపింది. ఈ సమన్లు అందుకున్న 21 రోజుల్లోగా సమాధానం చెప్పాలంటూ గురువారం న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు ద్వారా జారీ అయిన నోటీసుల్లో పేర్కొన్నది. స్పందించకపోతే కోర్టు ధిక్కారంగా పరిగణించాల్సి ఉంటుందని, తదుపరి చర్యలకు బాధ్యులు అవుతారని కూడా ఎస్ఈసీ హెచ్చరించింది.

**ఇదీ సంగతి..**

ఇన్వెస్టర్లను మోసం చేసి నిధుల సమీకరణకు అదానీ పాల్పడ్డారని ఎఫ్‌బీఐతోపాటు అమెరికా ప్రాసిక్యూటర్లు, రెగ్యులేటర్లు చెప్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా రెండు ఆరోపణలున్నాయి. అందులో మొదటిది తప్పుడు ప్రకటనలతో భారత్‌లో సోలార్ పవర్ కాంట్రాక్టులను అడ్డుపెట్టుకొని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, అమెరికా మదుపరుల నుంచి 2 బిలియన్ డాలర్లకుపైగా రుణాల సమీకరణకు దిగారు. ఇక రెండోది అంతర్జాతీయ ఆర్థిక సంస్థలను భాగస్వామ్యం చేస్తూ 1 బిలియన్ డాలర్లకుపైగా విలువైన బాండ్లను జారీ చేశారు. వీటిని అమెరికా తదితర మార్కెట్లలో ప్రవేశపెట్టి, అక్కడి మదుపరులకు అమ్మారు. అందుకే అమెరికా ఈ కేసును తీవ్రంగా పరిగణిస్తున్నది. కాగా, 2022లోనే ఈ కేసులో దర్యాప్తు మొదలైందని, అయితే అడ్డంకులు సృష్టించారని అక్కడి ప్రాసిక్యూటర్లు వెల్లడించారు. అయితే ఈ కేసును అదానీ గ్రూప్ ఖండిస్తున్నది. తాము ఏ తప్పూ చేయలేదని, అధికార ప్రతినిధులు ప్రకటిస్తున్నారు.

**మా కంపెనీలు భద్రమే: గ్రూప్ సీఎఫ్‌వో**

అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీపై లంచం కేసు నేపథ్యంలో గ్రూప్‌నకు చెందిన 11 సంస్థలపై ఎలాంటి అభియోగాలు నమోదు కాలేదని, కాబట్టి సంస్థలకు ఏ రకమైన న్యాయపరమైన చిక్కులు లేవని అదానీ గ్రూప్ సీఎఫ్‌వో జుగేషిందర్ రోబీ సింగ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో స్పందించారు. కాగా, ఈ కేసు గురించి మీడియాలో రకరకాల వార్తలు వస్తున్నాయని, మేము ఈ అంశంలో పూర్తి వివరణ ఇచ్చేదాకా ఎలాంటి ఊహాగానాలను ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. గౌతమ్ అదానీ, సాగర్ అదానీలతోపాటు అదానీ గ్రీన్ ఎనర్జీ ఎండీ వినీత్ జైన్, అజూర్ పవర్ గ్లోబల్ మాజీ సీఈవో రంజిత్ గుప్తా, దాని మాజీ ఉద్యోగి రూపేశ్ అగర్వాల్, సీడీపీక్యూ మాజీ ఉద్యోగులు సిరిల్ క్యాబెన్స్, సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రాలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.



## ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట: ఉత్తమ్

హైదరాబాద్, నవంబర్ 23: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల సంస్థ ఆర్‌ఏపీ ఎకో మోటర్స్..తాజాగా 'ఈ-రాజా' ఆటోను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఆటోను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ వాహనాలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఇలాంటి వాహనాల వల్లనే వాతావరణ కాలుష్యం తగ్గనున్నదన్నారు. ఈవీలను తయారు చేసే సంస్థలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ప్రకటించారు. ఆర్‌ఏపీ ఎకో మోటర్స్ సీఈవో బాలకృష్ణన్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో ఉన్న ఆర్అండ్‌డీ సెంటర్‌లో తయారైన ఈ-రాజా ఆటో సింగిల్ చార్జింగ్‌తో 120 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్లు ప్రయాణించనున్నదన్నారు. నలుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ ఆటో గంటకు 50 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 3 గంటల్లో ఈ ఆటో పూర్తిగా చార్జింగ్ అవుతుంది.

## విద్యార్థులకు ఇండిగో ఆఫర్

న్యూఢిల్లీ, నవంబర్ 23: ఇండిగో.. విద్యార్థులకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. విమాన టికెట్‌పై 6 శాతం రాయితీతోపాటు 10 కిలోల అదనపు లగేజీకి అవకాశం ఇచ్చింది. కంపెనీ వెబ్‌సైట్, యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారికే ఆఫర్. విద్యార్థుల అకాడమి ఏడాదికి సంబంధించిన బుక్స్ అధికంగా ఉంటాయని, ఈ నేపథ్యంలో 10 కిలోల లగేజీ తీసుకుపోవడానికి అనుమతినిచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రత్యేక ఆఫర్ హైదరాబాద్‌తోపాటు గోవా, ముంబై, ఢిల్లీ, బెంగళూరుతోపాటు 80 రూట్లలో నుంచి నడిచే విమాన సర్వీసుల్లో అందుబాటులో ఉంటాయి. 12 ఏండ్లకు పైబడి స్కూల్/యూనివర్సిటీకి సంబంధించిన ఐడీ కార్డు ఉన్నవారికే ఈ ఆఫర్.

## బీఎండబ్ల్యూ ఎం5

న్యూఢిల్లీ, నవంబర్ 23: బీఎండబ్ల్యూ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అత్యంత శక్తివంతమైన వీ8 ఇంజిన్‌తో తయారైన ఎం5 మాడల్ ధర రూ.1.99 కోట్లుగా నిర్ణయించింది. లగ్జరీ కార్లకు భారత్‌లో డిమాండ్ అధికంగా ఉండటంతో సరికొత్త మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## మస్క్ సంపదకు ట్రంప్ కిక్కు

న్యూయార్క్, నవంబర్ 23: ప్రపంచ కుబేరుడిగా వెలుగొందుతున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సంపదకు అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం బాగా కలిసొచ్చింది. ట్రంప్ గెలిచిన దగ్గర్నుంచి మస్క్ ఆస్తుల విలువ ఏకంగా 70 బిలియన్ డాలర్లు (రూ.5.89 లక్షల కోట్లు) ఎగబాకింది మరి. దీంతో ఇప్పుడాయన సంపద బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం తొలిసారి 347.8 బిలియన్ డాలర్ల (రూ.29.25 లక్షల కోట్లు)ను చేరింది. 2021 నవంబర్‌లో గరిష్ఠంగా 321.7 బిలియన్ డాలర్లుగా నమోదై రికార్డు సృష్టించగా, ఆ రికార్డు ఇప్పుడు చెరిగిపోయినట్టైంది. ట్రంప్, మస్క్ మధ్యనున్న సంబంధాలు.. స్టాక్ మార్కెట్లలో టెస్లా షేర్ విలువను పరుగులు పెట్టిస్తున్నాయి.

## పెరిగిన హౌజింగ్ ప్రాజెక్టుల వ్యయం

న్యూఢిల్లీ, నవంబర్ 23: దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో గృహ నిర్మాణ ప్రాజెక్టుల సగటు నిర్మాణ వ్యయం గత నాలుగేండ్లలో భారీగా పెరిగింది. 2024 అక్టోబర్ నాటికి నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.2,780కి పెరిగిందని, ముఖ్యంగా భవన నిర్మాణ సామాగ్రి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఖరీదైనవిగా మారాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా తన నివేదికలో వెల్లడించింది. అక్టోబర్ 2020లో చదరపు అడుగుకు అయ్యే ఖర్చు రూ.2,000గా ఉన్నది. గతేడాది నుంచి ఇసుక, ఇటుక, కలప, రాగి, అల్యూమినియం వంటి నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ...కూలీల కోసం పెట్టే ఖర్చు 25 శాతం పెరిగిందని కొలియర్స్ తెలిపింది.

